



చెన్నకేశవ ఆలయ భూములను చదును చేసి రోడ్ల నిర్మాణం చేపడుతున్న దృశ్యం

రెండోసారీ..!



స్టీలు ప్లాంటు పేరిట గ్రావెల్‌ను ప్రైవేటుకు తరలిస్తున్న వైనం

(కడప-ఆంధ్రజ్యోతి): ఎవరైనా ఇల్లు కానీ, పరిశ్రమ కానీ నిర్మాణం చేయడానికి ఒకసారి టెంకాయ కొడతారు. కానీ సీఎం వైఎస్ జగన్ మాత్రం రెండుసార్లు టెంకాయ కొట్టారు. వైసీపీ పాలనలో అంతా రివర్స్ కదా.. సరే.. అధికారం చేపట్టిన ఆర్నెళ్లకే టెంకాయ కొట్టి తమది చిత్తశుద్ధి అని వైఎస్ జగన్ గొప్పగా ప్రకటించుకున్నారు. ఉక్కు ఫ్యాక్టరీ ఇక సాకారం అవుతుందని జిల్లా ప్రజలు సంతోషించారు. త్వరలో తమకు ఉద్యోగాలు వస్తాయని నిరుద్యోగులు ఆశించారు. ఒక్క సంవత్సరం.. రెండు సంవత్సరాలు.. మూడు సంవత్సరాలు గడిచాయి. అదిగో కంపెనీ.. ఇదిగో ఫ్యాక్టరీ.. జపాన్ వారు వచ్చారు.. చైనా వారు వస్తున్నారు.. ఇలా రకరకాలుగా చెబుతూ వచ్చారే కానీ ఉక్కు సాకారం కాలేదు. చివరకు మొదటిసారి టెంకాయ కొట్టిన చోటే మూడేళ్ల తర్వాత.. అంటే 15 ఫిబ్రవరి 2023న సీఎం హోదాలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రెండోసారి టెంకాయ కొట్టారు.

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ఎంతోకాలంగా మనం ఎదురు చూస్తున్న ఉక్కు సంకల్పానికి ఈ రోజు పునాదిరాళ్లు పడ్డాయన్నారు. తన తండ్రి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయానికి అనుగుణంగా ఈ ప్రాంతంలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. జేఎస్‌డబ్ల్యు స్టీలు లిమిటెడ్ రూ.3300 కోట్లతో మొదటి దశ కింద పనులు చేపట్టనుందని, రాబోయే 24 నుంచి 30 నెలల్లో ఈ ఫ్యాక్టరీ పూర్తవుతుందని అన్నారు. నాన్న చనిపోయాక ఈ ప్రాంతం గురించి పట్టించుకున్న నాయకుడే లేడని.. దేవుని దయ, మీ ఆశీర్వాదాలతో మీ బిడ్డ సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన తరువాత ఈ ప్రాంతానికి మంచి రోజులు ఒక్కొక్కటిగా రావడం మొదలయ్యాయంటూ గొప్పగా చెప్పారు.

ఈ మాటలు చెప్పి సరిగ్గా ఏడాది అయింది. సీఎం వైఎస్ జగన్ చెప్పిన 24 నెలల్లో 12 నెలలు పూర్తయ్యాయి. ఇప్పటికీ అక్కడ ఎలాంటి నిర్మాణాలూ లేవు. కొన్ని రోడ్లు వేశారు. రేకుల షెడ్లు ఏర్పాటు చేశారు. అంతే.. ఫ్యాక్టరీ కల సాకారం కాలేదు. అయితే.. స్టీలు ఫ్యాక్టరీ పేరుతో చుట్టు పక్కల గ్రావెల్‌ను అక్రమంగా అమ్మి సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఐదేళ్లుగా ఊరించి ఫ్యాక్టరీని నిర్మించకపోగా.. ఉన్న సహజవనరులను గుల్ల చేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.




స్టీలు ప్లాంట్ స్థలంలో ఏర్పాటు చేసిన రేకుల షెడ్లు

ఏం చెబితిరి ఏం చెబితిరి

రాష్ట్ర విభజన చట్టం ప్రకారం కడపలో స్టీలు ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే అప్పటి కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదు. 2019లో అప్పటి సీఎం చంద్రబాబునాయుడు మైలవరం మండలంలో ఉక్కుఫ్యాక్టరీకి శంకుస్థాపన చేశారు. అనంతరం ప్రభుత్వం మారడంతో వైఎస్ జగన్ సీఎం అయ్యారు. ఆయన చంద్రబాబు ఏర్పాటు చేయాలనుకున్న ప్రాజెక్టును అటకెక్కించి 2019 డిసెంబరులో జమ్మలమడుగు మండలం చిన్నదండ్లూరు వద్ద స్టీలు ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేశారు. ఎన్నికలకు ఆరు నెలల ముందు శంకుస్థాపన చేస్తే అది మోసం... ఎన్నికలు అయిన ఆరు నెలలకే శంకుస్థాపన చేస్తే చిత్తశుద్ధి అంటూ పెద్ద పెద్ద డైలాగులు చెప్పారు. జగన్ చెప్పిన మేరకు 2022 డిసెంబరు నాటికే స్టీలు ప్లాంటు పూర్తి కావాల్సి ఉంది. అయితే అంతా తూచ్‌గా మారింది. ఇక రెండోసారి జగన్ జేఎస్‌డబ్ల్యు స్టీలు లిమిటెడ్ పేరుతో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తున్నామంటూ గత ఏడాది ఫిబ్రవరిలో టెంకాయ కొట్టారు. ఏడాది దాటినా కనీసం జమ్మలమడుగు ప్రధాన రహదారి నుంచి స్టీలు ప్లాంటుకు రోడ్డే పూర్తికాలేదు. విశేషమేమంటే స్టీలు ప్లాంటు పేరు చెప్పి ఇక్కడ గ్రావెల్ అక్రమంగా తరలించి సొమ్ము చేసుకోవడం గమనార్హం.

సీఎం వైఎస్ జగన్ మొదటిసారి స్టీలు ప్లాంట్ కోసం ఆవిష్కరించిన శిలాఫలకం



- నేను సీఎం అయ్యాకే ఒకటొక్కటిగా మంచి రోజులు మొదలయ్యాయి
- నాన్న ఆశయాలకనుగుణంగా స్టీలుప్లాంటు
- 24 నుంచి 30 నెలల్లో మొదటి దశ పూర్తి
- గత ఏడాది ఫిబ్రవరి 15న ప్రకటించిన సీఎం వైఎస్ జగన్
- ఉక్కు ఫ్యాక్టరీకి రెండోసారి సీఎం టెంకాయ కొట్టి ఏడాది
- పన్నెండు నెలలు పూర్తయినా అతీగతీ లేదు



సీఎం వైఎస్ జగన్ రెండోసారి టెంకాయ కొట్టిన సందర్భంగా ఏర్పాటు చేసిన దిమ్మె

ఆయనది తీరని భూ దాహం

- రూ.40 కోట్ల ఆలయ భూములు ఆక్రమణ

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 15: వైసీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ప్రొద్దుటూరులో ఆ ప్రజాప్రతినిధి భూదాహం ఎంతకూ తీరడం లేదు. తాజాగా రూ.40 కోట్ల విలువ చేసే దేవదాయ శాఖ స్థలానికి ఎసరు పెట్టారు. దొరసానిపల్లెలో ఆ ప్రజాప్రతినిధి ఇంటి ముందే ఉన్న చెన్నకేశవ స్వామి ఆలయ భూములలో ఇప్పటికే వందల ట్రాక్టర్లతో మట్టితోలి చదును చేసి రోడ్ల నిర్మాణం ప్రారంభించారు. ఇంత విలువైన భూముల్లో అక్రమంగా రోడ్లు వేస్తున్నా దేవదాయ అధికారులు అటు వైపు తొంగికూడా చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది. వీరికి భారీ స్థాయిలో ముడుపులు ముట్టినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అందువల్లే ఆ భూములను సాగు చేయడానికి పనికిరాకుండా, ప్లాట్లుగా మార్చడానికి పెద్ద ఎత్తున మట్టి తరలించి చదును చేసినా పట్టించుకోలేదని అంటున్నారు.

ప్రజాప్రతినిధి ఇంటి ముందే ఉండటంతో..

అధికార పార్టీకి చెందిన ఆ ప్రజాప్రతినిధి ఇంటి ముందే చెన్నకేశవస్వామి ఆలయ భూములు 4 ఎకరాలు ఉన్నాయి. వీటిని హస్తగతం చేసుకోవడానికి ఈ ఐదేళ్లలో రకరకాల ఎత్తుగడలు వేశారు. ప్రభుత్వ అనుమతులతో అక్కడ పంచాయతీ ఆధ్వర్యంలో పార్కు నిర్మాణం చేపడతామని తెలిపారు. దేవదాయ శాఖ నుంచి అనుమతులు రాకపోవడంతో చివరికి నేరుగా రంగంలోకి దిగారు. భూములు చదును చేసి అందులో రోడ్లనిర్మాణం చేపట్టారు.

దేవదాయ శాఖ అనుమతులు లేవు..

దొరసానిపల్లెలోని చెన్నకేశవాలయం భూములలో పనులు చేపడుతున్నట్లు ఫిర్యాదులు అందాయి. ఆ భూములు ఎవ్వరికీ లీజుకు ఇవ్వలేదు. అనుమతులు లేకుండా ఆ భూములలో రోడ్లు వేస్తే తొలగిస్తాం. నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకుంటాం.

- శంకర్‌బాలాజీ, అసిస్టెంట్ కమిషనర్, ఎండోమెంట్ డిపార్టు మెంట్, కడప

కనులపండువగా కల్యాణం



ప్రత్యేక అలంకరణలో కడప రాయుడు, శ్రీదేవి, భూదేవి అమ్మవారులు

కడప (కల్చరల్), ఫిబ్రవరి 15. దేవుని కడప లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం ఉదయం శ్రీనివాసుడి కల్యాణం కనులపండువగా సాగింది. వేదికకు ఓ వైపున వేద పండితుల మంత్రోచ్చారణలు, మరోవైపు అన్నమయ్య సంకీర్తనలు, మంగళవాయిద్యాలు, గానామృతం, సుస్వర నాదాల నడుమ కల్యాణం ఆద్యంతం కమనీయంగా సాగింది. తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్వర్యంలో చేపట్టిన స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తజనం విశేషంగా తరలివచ్చారు. కల్యాణం అనంతరం భక్తులకు ముత్యాల తలంబ్రాలు పంపిణీ చేశారు. సాయంత్రం ఊంజల్‌సేవ నిర్వహించారు. అలాగే రాత్రి స్వామివారు గజవాహనంపై భక్తులను కటాక్షించారు. కాగా.. బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం రథసప్తమి వేడుకలు జరుగనున్నాయి.

టీడీపీలోకి వైసీపీ నేత డాక్టర్ ఆదర్శ్‌రెడ్డి?



పుత్తాతో ఆదర్శ్‌రెడ్డి మంతనాలు

చెన్నూరు, ఫిబ్రవరి 15: వైఎస్ కుటుంబానికి వీరవిధేయుడు, కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డికి అత్యంత ఆత్మీయులు అయిన చెన్నూరుకు చెందిన ప్రముఖ దంత వైద్యుడు డాక్టర్ ఆదర్శ్‌రెడ్డి టీడీపీలోకి రానున్నారు. రాజకీయంగా ఎంతో నేపథ్యం ఉన్న పీటీ వీరారెడ్డి కుటుంబం నుంచి వచ్చిన ఆదర్శ్‌రెడ్డి టీడీపీలోకి వస్తుండటంతో చెన్నూరు మండలంలో వైసీపీకి భారీ గండి పడుతుందని చెప్పవచ్చు. ఈ మేరకు ఆయన కడపలోని బిల్టప్ వద్ద ఉన్న టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డిని కలిసి మాట్లాడారు. అలాగే యువనేత పుత్తా చైతన్యరెడ్డి ఆదర్శ్‌రెడ్డి రాకతో హర్షం వ్యక్తం చేశారు.

పోలింగ్ స్టేషన్లలో వసతులు సిద్ధం

కడప(కలెక్టరేట్), ఫిబ్రవరి 15: రానున్న సాధారణ ఎన్నికలకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా పోలింగ్ స్టేషన్లలో సదుపాయాలు, సిబ్బందిని సిద్ధం చేశామని కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో ఎన్నికల నిర్వహణ సన్నద్ధతపై అన్ని రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు జేసీ గణేశ్‌కుమార్, నగర కమిషనర్ ప్రవీణ్‌చంద్, ఇన్‌చార్జి డీఆర్వో శ్రీనివాసులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల ఏర్పాటుతో పాటు సిబ్బందిని సిద్ధం చేశామన్నారు. ఓటర్ల జాబితాలో తప్పొప్పులపై క్షేత్రస్థాయిలో పారదర్శకంగా పరిశీలన జరుగుతోందన్నారు. రాజకీయ పార్టీలకు అభ్యంతరాలుంటే ఆయా నియోజకవర్గాల ఈఆర్వోల దృష్టికి తీసుకెళితే 48 గంటల్లో పరిశీలించి పరిష్కరిస్తారన్నారు.

వైసీపీ మునిగిపోయే పడవ

- సర్వేలన్నీ జగన్ ఓడిపోతున్నాడని చెపుతున్నాయి : తులసిరెడ్డి

కడప(కలెక్టరేట్), ఫిబ్రవరి 15: ప్రజల్లోని అన్ని వర్గాల్లో వ్యతిరేకతను మూటగట్టుకున్న వైసీపీ మునిగి పోయే పడవ అని పీసీసీ మీడియా చైర్మన్ తులసిరెడ్డి పేర్కొన్నారు. గురువారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన జిల్లా అధ్యక్షుడు గుండ్లకుంట శ్రీరాములుతో కలసి విలేకర్లతో మాట్లాడారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో సర్వేలన్నీ వైసీపీ ఓడిపోతుందని చెబుతున్నాయన్నారు. ఇప్పటికైనా వైసీపీ నాయకులు కాంగ్రెస్ పార్టీలోకి రావాలని పిలుపునిచ్చారు. జగన్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్నపుడు సభలు నిర్వహిస్తే కళకళలాడేవని, సంక్షేమ పథకాలు ఇచ్చినా కూడా ఇపుడు సభలకు బలవంతపు తరలింపులతో వెలవెల పోతున్నాయని ఎద్దేవా చేశారు. ప్రాంతీయ పార్టీల్లో టిక్కెట్టు రానివారు ఇంతటి తిరుగుబాటు చేయడం దేశచరిత్రలోనే లేదన్నారు. సమావేశంలో నగర అధ్యక్షుడు విష్ణు ప్రీతం రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నజీర్ అహమ్మద్, రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్, పొట్టిపాటి చంద్రశేఖర్ రెడ్డి, శ్యామలాదేవి, ప్రసాద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో ఉద్యోగుల నిరసన

కడప(కలెక్టరేట్), ఫిబ్రవరి 15: ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యలను వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలని ఏపీ జేఏసీ జిల్లా చైర్మన్ శ్రీనివాసులు, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, ఎస్టీయూ నేత ఇలియాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం భోజన విరామ సమయంలో కడప తహశీల్దారు కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగున్నరేళ్లుగా ఉద్యోగులకు రావాల్సిన 22వేల కోట్ల ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్‌చేశారు. ఓపీఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, అరియర్స్ బకాయిలు చెల్లించాలని అన్నారు. ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

సంక్షేమం ముసుగులో దోపిడీ


- దేశంలోనే అత్యంత ధనికుడు కావాలన్నదే లక్ష్యం
- ఎప్పుడు ఎన్నికలు జరిగినా జగన్ ఇంటికే
- టీడీపీ నేత కన్నా లక్ష్మీనారాయణ

కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 15: సంక్షేమం ముసుగులో వైఎస్ జగన్ భారీ దోపిడీకి పాల్పడ్డారని టీడీపీ రాష్ట్ర నేత కన్నా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. భారతదేశంలోనే అత్యంత ధనికుడుగా కావాలన్నదే జగన్ లక్ష్యమని తెలిపారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా జగన్‌ను ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. గురువారం కడప నగరం లోని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... వైఎస్ జగన్ పాలనకు చరమగీతం పాడడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎన్నికల షెడ్యూలు కోసం ప్రజలు ఆతృతతో ఎదురు చూస్తున్నారన్నారు. వైఎస్ జగన్ జైలులో ఉన్నప్పుడు బ్రిటీష పాలనను రీసెర్చి చేసి అవాస్తవాలు, అలవి కాని వాగ్దానాలతో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చారన్నారు. వచ్చినప్పటి నుంచి సంక్షేమం ముసుగులో భారీ దోపిడీ చేశారన్నారు. బ్రిటీష వారు సొంత సైన్యాన్ని ఏర్పాటు చేసుకుని భారతదేశాన్ని లూటీ చేశారని, అదే మాదిరిగా జగన్‌రెడ్డి పోలీసులను సొంత సైన్యంగా వాడుకుని ప్రశ్నించే వారిపై కేసులు పెడుతూ ప్రతిపక్షాన్ని నిర్వీర్యం చేస్తూ భయభ్రాంతులను చేసి పాలిస్తున్నాడని చెప్పారు. అయితే ప్రజలు అంత అమాయకులు కాదని, బ్రిటీష వారినే తరిమికొట్టారని గుర్తు చేశారు. జగన్‌ను కూడా ఇంటికి పంపించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. సంక్షేమం పేరుతో పది రూపాయలు పేద ప్రజలకందించి ప్రజల నుంచి వెయ్యి రూపాయలు దోచుకున్నాడని అన్నారు. ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య మాట్లాడుతూ రాజధాని గురించి వైవీ సుబ్బారెడ్డి మాట్లాడడం హేయమన్నారు. వైవీ సుబ్బారెడ్డికి మెదడు లేదని, గడిచిన ఐదు సంవత్సరాలు మూడు రాజధానుల పేరుతో రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారని తెలిపారు. ప్రపంచంలోనే అత్యంత అవినీతిపరుడు జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. గ్రేటర్ రాయలసీమలో బలిజలకు ఒక్క సీటు కేటాయించలేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు హరిప్రసాద్, శ్రీనివాసులు, రాంప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న కన్నా లక్ష్మీనారాయణ

ఎందుకీ కక్ష..?



వైసీపీ ప్రభుత్వం ఉపాధ్యాయుల పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తోంది. ఉద్యోగ ఉపాధ్యాయులకు రావలసిన పీఆర్సీ, డీఏలతో పాటు మరికొన్ని ఆర్థిక బకాయిలు చెల్లించలేదు. చివరికి ఉద్యోగ ఉపాధ్యాయులు దాచుకున్న ఏపీజీఎల్ఐ, పీఎఫ్ సొమ్ము కూడా ఈ ప్రభుత్వం వాడుకుందనే ఆరోపణలు ఉన్నాయి. విధుల్లో ఉన్న ఉపాధ్యాయులను మాత్రమే కాదు.. కొత్తగా ఉద్యోగాల్లో చేరే ఉపాధ్యాయులనూ వేధించేందుకు రంగం సిద్దం చేసింది. ఎన్నో ఏళ్ల పోరాటాలతో రద్దు చేయించిన అప్రెంటీస్ విధానం తిరిగి అమలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసింది. దీంతో తాము సాధించుకున్న ఉద్యమ ఫలాలు నీరుగారుతున్నాయని ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతున్నాయి.

- సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులే కాదు..
- ఉద్యోగాల్లో చేరే ఉపాధ్యాయులపైనా వైసీపీ కక్షసాధింపు
- ఎన్నో ఏళ్ల పోరాటాలతో వైఎస్సార్ హయాంలో అప్రెంటీస్ విధానం రద్దు
- తిరిగి దానిని పునరుద్ధరించిన వైఎస్ జగన్
- వెట్టిచాకిరీ వద్దంటూ మండిపడుతున్న ఉపాధ్యాయ సంఘాలు

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 15 : రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ 2024 నిర్వహణ కోసం జీవో 56 విడుదల చేసింది. ఈ జీవో ప్రకారం ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికయ్యే అభ్యర్థులు కచ్చితంగా అప్రెంటీస్ పూర్తిచేయాల్సి ఉంటుంది. దీంతో ఉపాధ్యాయ సంఘాలు అవాక్కయ్యాయి. పోరాట ఫలాలు బూడిదపాలయ్యాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అప్రెంటీస్ విధానం ఇలా..

రాష్ట్రంలో 1994 డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా అప్రెంటీస్ విధానం అమల్లోకి వచ్చింది. 1995 జూన్ నుంచి విధుల్లో చేరిన ఉపాధ్యాయులకు మొదటి సంవత్సరం రూ.1200, రెండో సంవత్సరం రూ.1500 గౌరవ వేతనం చెల్లించారు. స్కూలు అసిస్టెంటు స్థాయి వారికి మొదట రెండు సంవత్సరాలు రూ.1500, రూ.1800 గౌరవ వేతనం చెల్లించారు. ఈ వెట్టిచాకిరీ విధానం రద్దు చేయాలంటూ ఏళ్లతరబడి ఉపాధ్యాయులు ఉద్యమించారు. చివరకు 2008లో 13 రోజుల ఉపాధ్యాయులు సమ్మె చేశారు. దీంతో దిగివచ్చిన అప్పటి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం అప్రెంటీస్ విధానాన్ని రద్దు చేసింది. ఫలితంగా 2012 నుంచి అప్రెంటీస్ లేని ఉపాధ్యాయ పోస్టుల భర్తీ జరుగుతోంది. వీరందరికీ రెగ్యులర్ వేతనాలు చెల్లించారు. ప్రస్తుతం 2024 డీఎస్సీ నోటిఫికేషన్‌తో తిరిగి అప్రెంటీస్ విధానం అమల్లోకి తేవడంతో ఉపాధ్యాయ వర్గాలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాయి. ఇకమీదట ఉద్యోగాలు పొందే ఉపాధ్యాయులు రెండేళ్ల పాటు అప్రెంటీస్ పూర్తి చేయాల్సి ఉంటుంది. వీరికి మొదటి సంవత్సరం మూల వేతనంలో సగం, రెండో సంవత్సరం 60 శాతం వేతనంగా చెల్లించనున్నారు. దీనికి ఎటువంటి అలవెన్స్, ఇతర పారితోషికాలు చెల్లించరు. ప్రభుత్వ నిబంధనల మేరకు అప్రెంటీస్ పూర్తి చేసిన వారిని మాత్రమే రెగ్యులర్ ఉపాధ్యాయులుగా గుర్తిస్తారు. వీరికి సెలవు సౌకర్యాలలో కూడా కనీస పరిమితులు ఉంటాయి. ఉద్యోగ భద్రత ఉండదు. ఒకరకంగా ఇది వెట్టిచాకిరీనే. రెండేళ్లకు నోషనల్ ఇంక్రిమెంట్లు ఉంటాయో ఉండవో కూడా ఇందులో పేర్కొనలేదు.

అప్రెంటీస్ విధానంలో వేతనం ఇలా..

ప్రస్తుతం ఎస్జీటీల కనీస మూలవేతనం రూ.32,670. స్కూలు అసిస్టెంట్ల కనీస మూలవేతనం రూ.44,570. మూలవేతనం, కరువు బత్యం, ఇంటి అలవెన్స్ కలిపి ఎస్జీటీలకు రూ.44,559, స్కూలు అసిస్టెంట్లకు రూ.60,790 లభించనుంది. కానీ 2024 డీఎస్సీ ఎస్జీటీలకు నెలకు రూ.16,335 మాత్రమే చెల్లిస్తారు. అలాగే స్కూలు అసిస్టెంట్లకు సంబంధించి రూ.22,285 మాత్రమే చెల్లిస్తారు. సంవత్సరానికి ఒక్కో ఎస్జీటీ రూ.3.40లక్షలు, స్కూలు అసిస్టెంటు రూ.4.62లక్షలు నష్టపోవాల్సి ఉంటుంది. కొత్తగా డీఎస్సీలో చేరే ఉపాధ్యాయులు దీనిని గుర్తించాల్సి ఉంది. ఎన్నో ఏళ్లపాటు ధర్నాల మొదలు ఆమరణ నిరాహార దీక్షలు, సమ్మెలు చేయడం ద్వారా అప్రెంటీస్ విధానాన్ని రద్దు చేయించుకుని నోషనల్ ఇంక్రిమెంట్లు కూడా పొందారు. కానీ ప్రస్తుతం ఒక్క కలం పోటుతో తిరిగి అప్రెంటీస్ విధానాన్ని ఈ ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. చేసిన ఉద్యమాలన్నీ బూడిదపాలయ్యాయని చెప్పాలి. ప్రభుత్వం దీనిపై పునరాలోచన చేయాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

ఉద్యోగ భద్రత ఉండాలి..



అలు పెరగని ఉద్యమాలతో సాధించుకున్న అప్రెంటీస్ రద్దు ఇక నీళ్లపాలే. 2024 డీఎస్సీలో రెగ్యులర్ వేతనాలు ఇచ్చేలా 56 జీవో మార్చాలి. ఖాళీల సంఖ్య పెంచాలి. షెడ్యూలు విడిది కుదించి తక్షణ నియామకాలు చేపట్టాలి. ఓపీఎస్ వర్తించే విధంగా నోటిఫికేషన్ సవరించాలి. గరిష్ట వయసు సడలించాలి. ఉద్యోగ భద్రత ఉండేలా నియామక ప్రక్రియ జరగాలి.

- సీవీ ప్రసాద్, ఏపీటీఎఫ్, అమరావతి

విద్యాశాఖలో మాత్రమే ఎందుకు?



ఎన్నో ఏళ్ల పోరాటాల ద్వారా దశాబ్దం క్రితమే అప్రెంటీస్‌ను రద్దు చేయించాం. మళ్లీ ఇప్పుడు అప్రెంటీస్ విధానం తేవడం చాలా బాధాకరం. ఏ శాఖలో లేని విధంగా కేవలం విద్యాశాఖ మాత్రమే ఎందుకు అప్రెంటీస్ ద్వారా నోటిఫికేషన్ విడుదల చేసిందో అర్థం కావడంలేదు. డీఎస్సీ రాసే అభ్యర్థులు అన్ని రకాల విద్యార్హత లు కలిగిన ఉపాధ్యాయ శిక్షణ పొందిన వారే. వారికి మళ్లీ అప్రెంటీస్ ఎందుకు. ఇది వెట్టిచాకిరీ తప్ప మరొకటి కాదు.

- ఇలియాస్‌బాషా, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు


మరలా ప్రవేశపెట్టడం దుర్మార్గం..



డీఎస్సీ నోటిఫికేషన్‌లో అప్రెంటీస్ విధానాన్ని తిరిగి ప్రవేశపెడుతూ వైసీపీ ప్రభుత్వం కొత్త రూల్ జారీ చేయడం దుర్మార్గం. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అప్రెంటీస్ విధానాన్ని అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయగా ఇప్పుడు ఆయన కుమారుడు జగన్ మళ్లీ దానిని అమలు చేశారు. ఉపాధ్యాయ నియామకాల్లో అప్రెంటీస్ విధానం రద్దు చేయకపోతే ప్రభుత్వం మూల్యం చెల్లిస్తుంది.

- మాదన విజయకుమార్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

వెంటనే రద్దు చేయాలి..



డీఎస్సీ 1994 నుంచి ప్రారంభమైన ఈ అప్రెంటీస్ విధానం ద్వారా ఉపాధ్యాయులు వెట్టిచాకిరీకి గురయ్యారు. ఆనాటి నుంచి సుదీర్ఘమైన పోరాటాల తర్వాత 2008లో 13 రోజుల పాటు సమ్మె చేయడంతో ఈ విధానాన్ని అప్పటి ప్రభుత్వం రద్దు చేసింది. అప్పుడు దాదాపు లక్షా 80వేల మంది ఉపాధ్యాయులను రెగ్యులర్ చేశారు. తిరిగి ఈ ప్రభుత్వం అప్రెంటీస్ విధానం మొదలు పెట్టింది. దీనిని వెంటనే రద్దు చేయాలి.

- ఖాదర్‌బాషా, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

ట్రాక్టరు ఢీకొని బాలుడు మృతి


మృతి చెందిన షేక్ మహ్మద్ మౌజం

కడప (క్రైం), ఫిబ్రవరి 15 : కడప రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. కడప మోచంపేటలోని చిలకలబావివీధికి చెందిన షేక్ మహ్మద్ మౌజం (10) అనే బాలుడు రోడ్డుపై వెళుతుండగా యానాది కాలనీకి చెందిన నాగయ్య ట్రాక్టరు నడుపుతూ ఆటోను తప్పించబోయి బాలుడిని ఢీకొన్నాడు. కొన ఊపిరితో ఉన్న ఆ బాలుడిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి తల్లి హసన్‌బేగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

టీడీపీ నేత శబరిమలలో గుండెపోటుతో మృతి


వెంకటరమణారెడ్డి (ఫైల్)

చెన్నూరు, ఫిబ్రవరి 15 : చెన్నూరుకు చెందిన టీడీపీ నేత నేలటూరి వెంకటరమణారెడ్డి (56) గురువారం శబరిమలలో గుండె పోటుతో మృతి చెందాడు. రెండురోజుల క్రితం తమ బంధువులతో అయ్యప్ప దర్శనానికి వెళ్లిన ఆయన దర్శనానికి వెళ్లేందుకు పంబా నుంచి నడుచుకుంటూ శబరిమలకు వెళ్లి సన్నిధానం దగ్గరలో గుండెపోటుతో ఒక్కమారుగా కుప్పకూలిపోయాడు. వెంటనే బంధువులు ఆయనను అక్కడున్న వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈనెల 7న నేలటూరు వెంకటరమణారెడ్డి తమ బంధువులు, స్నేహితులతో కలిసి దాదాపు 200 కుటుంబాలతో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ నేపధ్యంలో ఆయన బంధువులు, కుటుంబసభ్యులతో శబరమల వెళ్లాడు. అక్కడ గురువారం మధ్యాహ్నం గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన మృతి వార్త తెలియగానే టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుత్తా నరసింహారెడ్డి, మండల కన్వీనరు విజయభాస్కర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఇందిరెడ్డి శివారెడ్డి, ఆకుల ప్రసాద్‌బాబు, ఆకుల చలపతి, జి.మల్లిఖార్జునరెడ్డి, షబ్బీర్‌హుసేన్ తదితరులు ప్రగాఢ సంతాపం తెలిపారు.

మాండవ్యనదిలో పడి వ్యక్తి మృతి


మృతదేహాన్ని వెలికితీస్తున్న ఫైర్ సిబ్బంది

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 15: రాయచోటి పట్టణ పరిధిలోని గాలివీడు రింగు రోడ్డు సమీపంలో మాండవ్యనది నీటిలో పడి మతిస్థిమితం లేని వ్యక్తి మృతి చెందినట్లు అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు... రాయచోటి పట్టణంలోని కొత్తపల్లి ప్రాంతానికి చెందిన మహబూబ్‌బాషా గత కొన్నేళ్లుగా మానసిక స్థితి సరిగ్గా లేక తిరుగుతూ ఉండేవాడు. ఇతను ఐదు సంవత్సరాల క్రితం భార్యకు విడాకులు ఇచ్చి తన తల్లి వద్ద ఉంటున్నాడు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం పట్టణంలోని గాలివీడు రోడ్డులోని రింగు రోడ్డు సమీపంలో మాండవ్యనదిలో పడి మృతి చెందగా గురువారం మృతదేహం నీటిపైన తెలియాడుతుండగా స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు అర్బన్ సీఐ ఆధ్వర్యంలో పోలీసులు, ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని నదిలో నుంచి మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం రాయచోటి ఏరియా ఆసుపత్రికి తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి ప్రాణాలు కాపాడిన పోలీసులు

కడప (క్రైం), ఫిబ్రవరి 15: కడప అక్కాయపల్లెలోని తిలక్‌నగర్‌కు చెందిన శీలం మనోజ్‌రెడ్డి (18) ప్రాణాలను పోలీసులు కాపాడారు. ఈనెల 14న ఉదయం 8 గంటలకు కాలేజీకి వెళ్లాడు. అప్పటి నుంచి తిరిగి ఇంటికి రాకపోవడంతో తల్లి శీలం ఓబులమ్మ కడప తాలుకా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కడప తాలుకా సీఐ రాజు, ఎస్‌ఐ తిరుపాల్‌నాయక్ ఆధ్వర్యంలో బాలుడి ఆచూకీ కోసం బాలుడి మొబైల్ నెంబరు లోకేషన్ పెట్టారు. అంతా తిరుగుతూ బ్లూకోల్ట్ సిబ్బంది నగరంలోని చెమ్ముమియ్యాపేటలో గల రైల్వే ట్రాక్ వెంబడి సుమారు ఒక కిలోమీటరు వెళ్లగా రైల్వే బ్రిడ్జి కింద తన చేయి కోసుకుని రక్తపు మడుగులో స్పృహ కోల్పోయి ఉన్నాడు. వెంటనే ఎస్‌ఐ తిరుపాల్‌నాయక్ తన సిబ్బంది సహాయంతో బాలుడిని రిమ్స్‌కు తరలించి వైద్యం చేయించి అనంతరం తల్లికి అప్పగించారు.

జాతీయ స్థాయి పోటీల్లో రాణించిన శివకోటి



రన్నర్ ట్రోఫీతో శివకోటి

నందలూరు, ఫిబ్రవరి 15 : నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ అరవపల్లె గ్రామానికి చెందిన శివకోటి జాతీయ స్థాయి వికలాంగ క్రికెట్ పోటీలలో విశేష ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ రాజస్థాన్ రాష్ట్రంలోని అజ్మీర్ నగరంలో జరిగిన 3వ మినీ నేషనల్ డిసేబుల్డ్ క్రికెట్ టోర్నమెంట్‌లో ఆంధ్ర రాష్ట్ర దివ్యాంగుల జట్టు రన్నరప్‌గా నిలిచిందన్నారు. ఫైనల్ మ్యాచ్‌లో రాజస్థాన్ జట్టుతో చివరి వరకు పోరాడి ఓటమి పాలయ్యామని తెలిపారు. ఈ టోర్నమెంటులో వైస్ కెప్టెన్సీతో అద్భుతమైన ప్రదర్శన కనబరిచి బ్యాటింగ్‌లోను, బౌలింగ్‌లోనూ రాణించి 90 పరుగులు చేయడంతో పాటు 9 వికెట్లు తీసుకున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ దివ్యాంగ్ క్రికెట్ అసోసియేషన్ సెక్రటరీ వసంతకుమార్ ఫైనల్ ముగిసిన వెంటనే తనను అభినందిస్తూ ప్రశంసాపత్రం ఇచ్చారని తెలిపారు.

డీఎస్సీ ఉర్దూ పోస్టులకు తీరని అన్యాయం

కడప (చిన్నచౌకు), ఫిబ్రవరి 15 : డీఎస్సీ 2024లో ఉర్దూ పోస్టులకు తీరని అన్యాయం జరిగిందని ఆల్ ఇండియా ఐడియల్ టీచర్స్ అసోసియేషన్ (ఐటా) రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.అబ్దుల్‌రజాక్, జిల్లా అధ్యక్షుడు నజీర్‌బాషా తెలిపారు. గురువారం వారు తమ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఉపాధ్యాయుల నియామకం కోసం మెగా డీఎస్సీ నిర్వహిస్తారని అభ్యర్థులు కళ్లు కాయలు కాచేలా వేచి చూశారన్నారు. నాలుగున్నర సంవత్సరాల తరువాత రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. అయితే ఉర్దూ మాధ్యమ పాఠశాలలు, ఉర్దూ మాధ్యమంలో చదివే విద్యార్థులు ఎక్కువగా ఉన్న జిల్లాల్లో అధిక సంఖ్యలో ఉర్దూ ఎస్‌జీటీ పోస్టులు ఉన్నప్పటికీ జిల్లాల వారీగా జీరో పోస్టులు ఒకటి రెండు చూపించారన్నారు. ఇది అన్యాయమని, ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న ఉర్దూ మాధ్యమ అభ్యర్థులకు తీవ్ర మనోవేదనకు గురిచేసిందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర విద్యాశాఖాధికారులు స్పందించి ఎస్‌జీటీ ఉర్దూ మాధ్యమ వాస్తవ ఖాళీలను ప్రకటించి ఉర్దూ మాధ్యమ అభ్యర్థులకు అన్యాయం జరగకుండా చూడాలని వారు డిమాండ్ చేశారు.

కష్టమైన సబ్జెక్టుపై ఎక్కువ శ్రద్ధ చూపాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ అనురాధ

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 15 : పదో తరగతి విద్యార్థులు వారికి కష్టతరంగా ఉన్న సబ్జెక్టులపై ఎక్కువ శ్రద్ధ చూపాలని జిల్లా విద్యాశాఖాధికారి అనురాధ సూచించారు. గురువారం కడప నగరం జయనగర్‌కాలనీ జడ్పీ బాలికోన్నత పాఠశాలను ఆమె సందర్శించారు. అలాగే మధ్యాహ్న భోజనం పరిశీలించారు. అనంతరం పదోతరగతి విద్యార్థులతో మాట్లాడారు. పదో తరగతి పరీక్షలపై అవగాహన కల్పించారు. పరీక్షలకు 30 రోజులే సమయం ఉందని, విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని మంచి ఫలితాలు సాధించాలన్నారు. యాక్షన్ ప్లాన్ ప్రకారం పరీక్షలకు సిద్ధం కావాలని తెలిపారు. కష్టతరంగా ఉన్న సబ్జెక్టులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

బి.కొత్తకోట, ఫిబ్రవరి 15: అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండల పరిధిలోని చంద్రమాకులపల్లె వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 5వ తరగతి ఇంగ్లీషు మీడియం, ఇంటర్ ఫస్టియర్ (సీఈసీ,హెచ్‌ఈసీ)లలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గురుకులం ప్రిన్సిపాల్ శ్రీరామ కోటేశ్వరరావు తెలిపారు. గురుకులంలో 5వ తరగతి ప్రవేశానికి 2023-24 విద్యా సంవత్సరంలో 4వ తరగతి చదువుతున్నవారు అర్హులన్నారు. అదేవిధంగా ఇంటర్‌లో ప్రవేశానికి ఈ ఏడాది 10వ తరగతి చదువుతున్నవారు అర్హులన్నారు. కళాశాలలో ప్రవేశానికి అన్నమయ్య, కడప జిల్లాలలో నివాసం ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ప్రవేశ పరీక్ష మార్చి 10వ తేదీ జరుగుతుందన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఈనెల 23 వరకు గడవు ఉందని, మరిన్ని వివరాలకు గురుకుల పాఠశాల పనివేళలలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.

అధికార పార్టీనా.. మజాకా



అధికార పార్టీ కావడంతో తమను అడిగేవారెవరూ ఉండరనుకున్నారో ఏమో.. మార్కెట్ యార్డును సొంత పనులకు యథేచ్ఛగా వాడుకుంటున్నారు. రైతులు పండించే పంటల ఉత్పత్తులను కొనుగోలు చేసి నిల్వ చేయాల్సిన చోట పెద్ద ఎత్తున ఇసుక, కంకర నిల్వలున్నాయి. రైతలకోసం ఉన్న విశ్రాంతి గదుల్లో బీహార్ కూలీలు ఉంటున్నారు. కడప మార్కెట్ యార్డు తమ సొంతు ఇల్లు అనేలా అధికార పార్టీ పెద్దలు వ్యవహరిస్తున్న తీరు విమర్శలకు తావిస్తోంది.

- సొంత పనులకు అడ్డాగా కడప మార్కెట్ యార్డు
- ఇక్కడే ఇసుక, కంకర నిల్వలు
- రైతుల విశ్రాంతి గదుల్లో బిహార్ కూలీల నివాసం
- మండిపడుతున్న రైతు సంఘాలు, రైతులు


కడప మార్కెట్ యార్డులో కాంట్రాక్టర్లు నిల్వ ఉంచిన ఇసుక, కంకర

కడప (రూరల్), ఫిబ్రవరి 15: కడప నగరంలోని శ్రీకృష్ణదేవరాయలు సర్కిల్ నుంచి దేవుని కడప వరకు రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. సదరు కాంట్రాక్టు పనులను కడప నగరానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి ముఖ్య అనుచరులు దక్కించుకున్నారు. ఈ మేరకు రోడ్డు పనులకు సంబంధించి కంకర, ఇసుక నిల్వలను పెద్ద ఎత్తున కడప వ్యవసాయ మార్కెట్ యార్డులో నిల్వ ఉంచారు. దీంతో మార్కెట్ యార్డులోకి రైతులు తమ ఉత్పత్తులు తీసుకుని రావాలన్నా ఇబ్బందికరంగా మారింది. అంతేకాదు.. ఇక్కడి రైతుల విశాంతి భవనాలను సైతం సదరు కాంట్రాక్టర్లు తమ ఆధీనంలో ఉంచుకున్నారు. ఇక్కడ బీహార్‌కు చెందిన కాంట్రాక్టర్లను, కూలీలను ఉంచారు. దీంతో రైతు విశ్రాంత భవరోడ్డు పనులు చేస్తున్న బీహార్ కూలీలకు అవి నివాసాలుగా మారాయి.

కడప మార్కెట్ యార్డులో ప్రస్తుతం పసుపు, వేరుశనగ కొనుగోళ్లు సాగుతున్నాయి. రాయలసీమ జిల్లాలతో పాటు నెల్లూరు, ప్రకాశం జిల్లా నుంచి పసుపు రైతులు ఇక్కడికి వస్తుంటారు. అలాగే జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వెరుశనగ రైతులు తమ పంటను మార్కెట్ యార్డుకు తీసుకొచ్చి విక్రయాలు సాగిస్తున్నారు. ఇలా పశుపు, వేరుశనగ రైతులు ప్రతిరోజు పదుల సంఖ్యలో మార్కెట్ యార్డుకు వస్తున్నారు. వీరికి సంబంధించిన విశ్రాంతి భవనాలను వైసీపీ పెద్దలు స్వాధీనం చేసుకుని అక్కడ బీహార్‌కు చెందిన కూలీలను ఉంచడంతో రైతులు చెట్ల కింద కాలం వెల్లదీస్తున్నారు. ఈ వ్యవహారంపై మర్చంట్ అసోసియేషన్ నాయకులు, రైతులు మండిపడుతున్నారు.

డిప్యూటీ సీఎంకు చెప్పినా..


డిప్యూటీ సీఎం, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి అంజద్ బాషా మూడురోజుల క్రితం మార్కెట్ యార్డులో వైఎస్సార్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఆ రోజున మర్చంట్ అసోసియేషన్ నాయకులు, రైతులు మంత్రి వద్దకు వెళ్లి సమస్యలను ఏకరువు పెట్టారు. రైతుల విశ్రాంతి భవనాలలో బీహార్ కూలీలు నివాసం ఉంటున్నారని దీంతో మార్కెట్‌యార్డుకు వచ్చే రైతులు ఇక్కట్లకు లోనవుతున్నారని వాపోయారు. అయినప్పటికీ దీనిపై ఎలాంటి చర్యలూ లేవు.

విశ్రాంతి భవనాలు అందుబాటులోకి తేవాలి

కడప వ్యవసాయ మార్కెట్ యార్డు రాయలసీమలోనే అతిపెద్ద మార్కెట్ యార్డు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన యార్డులో రైతులకు విశ్రాంతి భవనాలు అందుబాటులో లేనపోవడం దారుణమని మర్చంట్ అసోసియేషన్ నాయకులు రామకృష్ణారెడ్డి, మహేశ్ పేర్కొన్నారు. వీటిల్లో బయటివారు నివాసాలు ఉంటున్నారని ఇక్కడికి వచ్చే రైతుల పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయాన్ని మంత్రి అంజద్‌బాషా దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. అలాగే మరుగుదొడ్ల సౌకర్యం, తాగునీటి సదుపాయం లేని కారణంగా రైతులు, హమాలీలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే డ్రైనేజీ కాలువలు లేకపోవడం వలన వర్షపు నీరు బయటికి వెళ్లడానికి వీలులేక యార్డులోనే నెలల తరబడి నిల్వ ఉండటంతో తాము అనారోగ్య సమస్యలకు లోనవుతున్నామని పేర్కొన్నారు. యార్డులోని ఒక్కొక్క పసుపు గిడ్డంగికి ఏడాదికి రూ.40వేలకు పైగా పన్నులను మాత్రం ముక్కుపిండి వసూలు చేస్తున్నారని కానీ మౌలిక సదుపాయాలు మాత్రం కల్పించడం లేదని వాపోయారు. రైతు విశ్రాంతి భవనాలలో ఉన్న బీహార్ కూలీలను వెంటనే ఖాళీ చేయించి రైతులకు అందుబాటులోకి తేవాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున అందోళనలను చేపడతామని ఏపీ రైతు సంఘం నేత దస్తగిరి రెడ్డి హెచ్చరించారు. వ్యవసాయ మార్కెట్ యార్డు అధికారుల నిర్లక్ష్యంతో తమకు తిప్పలు తప్పడం లేదని రైతులు, హమాలీలు వాపోతున్నారు.

ఖాళీ చేయిస్తాం..

రైతుల విశ్రాంతి భవనంలో బీహార్ కూలీలు ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని వెంటనే వారిని ఖాళీ చేయించి రైతులకు అందుబాటులోకి తెస్తామని కడప వ్యవసాయ మార్కెట్ యార్డు ఇన్‌చార్జ్ సెక్రటరీ సుజాత పేర్కొన్నారు. ఈ విషయంపై మార్కెట్ యార్డు చైర్మన్‌తో కూడా సంప్రదించామన్నారు.


రైతుల విశ్రాంతి భవనాల్లో నివాసం ఉంటున్న బిహార్ కూలీలు, కాంట్రాక్టర్లు ఆరేసిన దుస్తులు

ప్రశ్నించడం ద్వారానే సమాజంలో మార్పు


సమావేశంలో మాట్లాడుతున్న రఘునాథరెడ్డి

కడప (నాగరాజుపేట), ఫిబ్రవరి 15 : ప్రశ్నించడం ద్వారానే సమాజం మార్పు చెందుతుందని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర పూర్వ కార్యదర్శి రఘునాథరెడ్డి అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు జేవీవీ యాత్రను ఈనెల 5వ తేదీ ప్రారంభించారు. ఇందులో భాగంగా స్థానిక హజరత్ అయేషా బాలికల స్కూలులో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రఘునాథరెడ్డి మాట్లాడుతూ సైంటిఫిక్ టెంపర్‌ను పెంచడానికి గత ప్రభుత్వాలు ప్రయత్నం చేస్తే ప్రస్తుతం దేశంలో పాలకులు దానిని తుంచివేస్తున్నారని తెపాఅరు. రాజ్యాంగాన్ని అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిది కానీ అందుకు భిన్నంగా మతం కేంద్రంగా మతోన్మాదాన్ని పెంచి రాజ్యాంగస్ఫూర్తికి విఘాతం కలిగిస్తోందన్నారు. జేవీవీ రాష్ట్ర నాయకుడు మురళీధర్ మాట్లాడుతూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 51ఎ (హెచ్)లోని శాస్త్రీయ దృక్పథాన్ని పరిరక్షించుకునే క్రమంలో జనవిజ్ఞాన వేదిక ఈ కళాజాత చేపట్టిందన్నారు. జేవీవీ నాయకురాలు అరుణ మాట్లాడుతూ మహిళలు దేశానికి గర్వకారణమన్నారు. స్త్రీ, పురుష సమానత్వం కావాలని, ఆచారాలు, సంప్రదాయాల పేరుతో మహిళలను అణగదొక్కడం సరికాదన్నారు. ఐక్యోపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జేవీవీ నాయకుడు రాజావెంగల్‌రెడ్డి మాట్లాడుతూ సైన్స్‌ను ప్రతిఒక్కరూ అనుసరించాలని, జీవితకాలం అంతా దానిని నమ్మాలన్నారు. కార్యక్రమంలో స్కూలు యాజమాన్యం మజహర్ ఆలీఖాన్, అక్బర్‌బాషా, ఖలీముద్దీన్, యాసిన్, సుల్తాన్, జేవీవీ రాష్ట్ర నాయకులు త్రిమూర్తులు, మురళీధర్, తవ్వా సురేష్, సునీత, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పోలంకి శ్రీనివాసులు, జిల్లా నాయకులు ఎంవీ రాజు, సుజన్‌కుమార్, బాల బయన్న, ప్రియాంక, సత్యనారాయణ, ప్రజాసంఘాల నాయకుడు కామనూరు శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

మోడల్ ఫౌండేషన్స్ స్కూల్స్‌ను గుర్తిస్తాం

- కేంద్ర పథకం ప్రోగ్రాం అసోసియేట్ అధికారి సూరిబాబు

సంబేపల్లె, ఫిబ్రవరి 15: దేశ వ్యాప్తంగా మోడల్ ఫౌండేషన్ స్కూల్స్‌ను గుర్తిస్తున్నట్లు కేంద్ర పథకం ప్రోగ్రాం అసోసియేట్ అధికారి సూరిబాబు గురువారం తెలిపారు. రాయచోటి పరిధిలోని గున్నికుంట్ల సెక్టార్‌లో చౌటపల్లి అంగన్వాడీ కేంద్రాన్ని మోడల్ ఫౌండేషన్ స్కూల్‌గా గుర్తించినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 40 పాఠశాలలను గుర్తిస్తున్నట్లు తెలియజేశారు.


అంగన్వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న సూరిబాబు

ప్రాథమిక పాఠశాల పరిధిలో ఉన్న అంగన్వాడీ కేంద్రాల్లో మోడల్ ఫౌండేషన్ స్కూల్‌ల ద్వారా ప్రీస్కూల్ పిల్లలకు అదనపు వసతులను కల్పించి మోడల్ ఫౌండేషన్ స్కూల్‌గా ఏర్పాటు చేసేందుకు గుర్తిస్తున్నట్లు తెలియజేశారు. సంబేపల్లె మండలంలో చౌటపల్లి, రాయచోటి అర్బన్ పరిధిలో మరొకటి గుర్తించినట్లు టీం సభ్యులు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్ భాస్కర్ రెడ్డి, ఏఎంవో షమీరుల్లా, చౌటపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హాజం, అంగన్వాడీ సూపర్‌వైజర్ జ్యోతి, అంగన్వాడీ వర్కర్ జయమ్మ, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పొదుపు సంఘాల డబ్బు స్వాహా

కమలాపురం రూరల్, ఫిబ్రవరి 15 : పొదుపు సంఘాల డబ్బును స్వాహా చేసేందుకు కొందరు సిద్ధపడుతున్నారు. నగర పంచాయతీ పరిధిలోని గిడ్డంగివీధిలో ఉన్న సుమతి గ్రూపునకు చెందిన డ్వాక్రా సంఘం సభ్యుల లీడర్లు పొదుపు డబ్బులు స్వాహా చేసినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రస్తుతం కమలాపురం నగర పంచాయతీ మెప్మా పరిధిలోకి వస్తుంది. అందులో పది మంది సభ్యులు సుమతి గ్రూపు పేరు మీద డ్వాక్రా సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈ సంఘం స్థానిక ఏపీజీబీలో రుణాలు తీసుకున్నారు. పొదుపు చేసుకుంటూ ఉన్నారు. బ్యాంకు నుంచి వారు తీసుకున్న ఈ రుణాన్ని ప్రతి నెలా రూ.50 వేలు బ్యాంకులో డ్వాక్రా సంఘం సభ్యులు చెల్లించి రసీదు తీసుకోవాల్సి ఉంటుంది. ఏం జరిగిందో ఏమో కానీ బ్యాంకులో చెల్లించాల్సిన డబ్బులు బయట ఉన్న రిసోర్స్‌పర్సన్‌కు కొంతకాలంగా డబ్బులు చెల్లిస్తూ వస్తున్నారు. అయితే ఆమె ఆ డబ్బులు బ్యాంకులో చెల్లించడం లేదని తెలుసుకున్న డ్వాక్రా సంఘం సభ్యులు ప్రశాంతి, భార్గవి, లక్ష్మినరసమ్మ గురువారం నగర పంచాయతీ కార్యాలయం చేరుకుని విషయాన్ని తెలిపారు. ప్రతి నెలా మేము రూ.50 వేలు సంఘం లీడరుకు ఇస్తూ వస్తున్నామని ఆమె డబ్బులు బ్యాంకులో చెల్లించకుండా బయట ఉన్న రిసోర్స్ పర్సన్‌కు ఇచ్చానని చెబుతోందన్నారు. గ్రూపు సభ్యులం అందరం బ్యాంకు వద్దకు వెళ్లి రిసోర్స్ పర్సన్‌ను అడగ్గా నేను బ్యాంకు కరస్పాండెంట్‌కు ఇచ్చానని ఇలా ఒకరి మీద ఒకరు చెప్పుకుంటున్నారని అన్నారు. గ్రూపు తరపున మేం ఇంతవరకు రూ.7 లక్షల వరకు వసూలు చేసి ఇచ్చామన్నారు. మేం ఇచ్చిన డబ్బులు ఎవరు స్వాహా చేశారో అర్థం కావడం లేదని ఈ విషయమై కలెక్టరుకు స్పందనలో అర్జీ ఇచ్చామని, అదేవిధంగా స్థానిక పోలీసు స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేశామన్నారు. ఉన్నతాధికారులు స్పందించి మాకు న్యాయం చేయాలని వారు తెలిపారు. ఈ విషయంపై మెప్మా ఏపీఎం లావణ్యను వివరణ కోరగా డబ్బులు స్వాహా అయిన విషయం వాస్తవమేనని, డ్వాక్రా సంఘం సభ్యులే నేరుగా బ్యాంకుకు వెళ్లి డబ్బులు చెల్లించి ఉంటే ఇంత జరిగేది కాదన్నారు. మొత్తం ఆరు లక్షలా 75 వేల రూపాయలు బ్యాంకులో చెల్లించలేదని తేలిందన్నారు. లీడర్ రిసోర్స్‌పర్సన్ ఇద్దరూ ఒకరి మీద ఒకరు చెప్పుకుంటున్నారని ఈ విషయాన్ని నగర పంచాయతీ కమిషనరు దృష్టికి కూడా తీసుకెళ్లామన్నారు.

ఆలస్యంగా వెలుగులోకి...


డబ్బులు స్వాహా అయినట్లు తెలుపుతున్న గ్రూపు సభ్యులు

జాతీయ రహదారి భూములు పరిశీలన


భూముల లేఔట్‌ను పరిశీలిస్తున్న జేసీ, ఆర్డీవో

రాజుపాలెం, ఫిబ్రవరి 15 : వేంపల్లె-చాగలమర్రి 440 జాతీయ రహదారి భూసేకరణ భూములను జేసీ గణేష్ కుమార్, ఆర్డీవో శ్రీనివాసులు గురువారం పరిశీలించారు. గ్రామాల్లోకి పోయే భూములు, గ్రామం వెలుపల పోయే భూములను వారు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు విజయశ్రీ, డిప్యూటీ తహశీల్దారు సాయినాథరెడ్డి, సర్వేయరు గుణశేఖర్, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు వెంటనే ప్రారంభించాలి



డ్వామా పీడీకి వినతిపత్రం అందిస్తున్న శివకుమార్, అన్వేష్

కడప (సెవెన్‌రోడ్స్), ఫిబ్రవరి 15 : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో ఉపాధి పనులు వెంటనే ప్రారంభించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శివకుమార్, అన్వేష్ డిమాండ్ చేశారు. గురువారం ఉదయం డ్వామా పీడీ యదుభూషణ్‌రెడ్డికి వారు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ సంవత్సరం వర్షాలు పడక గ్రామాల్లో కూలీలకు పనులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అదే విధంగా వలసలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పనులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 16న దేశవ్యాప్తంగా గ్రామీణ బంద్ నిర్వహిస్తున్నామన్నారు. వ్యవసాయ కార్మికులందరూ ఆయా మండల కేంద్రాల్లో నిరసన ప్రదర్శనల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

టీడీపీ వస్తేనే మెరుగైన భవిష్యత్తు : పుత్తా





పాతసంగటిపల్లెలో వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వారితో పుత్తా నరసింహారెడ్డి... పుత్తాకు బైకు ర్యాలీతో స్వాగతం పలుకుతున్న టీడీపీ నేతలు

పెండ్లిమర్రి, ఫిబ్రవరి 15: 'మీ భూములు, ఆస్తులు, మీ దగ్గరే భద్రంగా ఉండాలంటే మళ్లీ టీడీపీ రావాల్సిందే. పొరపాటున మీరు వైసీపీకి ఓటు వేస్తే మళ్లీ జగన్ సీఎం అయితే మీ పొలాలు, స్థలాలు ఏమీ ఉండవు అన్నింటిని వైసీపీ వారు లాక్కుంటారు. టీడీపీనే మీకు భవిష్యత్తు' అంటూ టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పుత్తా నరసింహారెడ్డి పేర్కొన్నారు. 'బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీలో భాగంగా గురువారం మండల పరిధిలోని పాతసంగటిపల్లెలో ఇంటింటికి వెళ్లారు.ఎమ్మెల్యే రవిరెడ్డి అనుచరులు నియోజకవర్గంలో భూ ఆక్రమణలు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారన్నారు. అధికారాన్ని అడ్డంపెట్టుకొని విలువైన భూములను లాగేసుకుంటున్నారన్నారు. మళ్లీ జగన్ సీఎం అయితే మీ ఆస్తులు ఏమీ మిగలవన్నారు. అదే చంద్రబాబు సీఎం అయితే అందరూ హాయిగా జీవించగలరన్నారు. రైతులకు ఏడాదికి రూ.20వేల ఆర్థిక సాయం, విద్యార్థులకు రూ.15వేలు, ఆడబిడ్డ నిధి కింద ఇంట్లోని మహిళలకు నెలకు రూ.1500, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, నిరుద్యోగ భృతి, ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి చంద్రబాబు సీఎం అయితే ఏ కుటుంబానికి ఎంత లబ్ధి చేకూరుతుందో వివరించారు. అన్ని రకాల ప్రజల కష్టసుఖాలను తెలుసుకుంటూ ప్రజలతో ఆయన మమేకమయ్యారు.

టీడీపీలోకి వలసలు

పాతసంగటిపల్లెలో పలువురు టీడీపీలో చేరారు. వైఎస్ కుటుంబానికి సన్నిహితులుగా ఉన్న జి.సురేందర్‌రెడ్డి, మునిరెడ్డి, మహేంద్రరెడ్డి, మల్లారెడ్డి, పెద్దనరసింహారెడ్డి, చిన్నరెడ్డితో పాటు దాదాపు 60 వైసీపీ కుటుంబాలు ఫ్యాన్‌కు బైబై చెప్పి సైకిల్ ఎక్కేశారు.

అపూర్వ స్వాగతం

బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీలో భాగంగా పాతసంగటిపల్లెలో పుత్తా నరసింహారెడ్డి, చైతన్యరెడ్డి, లక్ష్మిరెడ్డి, సాయినరసింహారెడ్డిలకు అపూర్వ స్వాగతం లభించింది.టీడీపీ నేతలు సురేంద్రనాథరెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, మైసూరారెడ్డి, అయ్యవారురెడ్డి ఆధ్వర్యంలో క్రేన్‌తో గజమాల వేసి సుమారు 250 బైకులతో బైకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పుత్తా కుటుంబంపై పూలవాన కురిపిస్తూ అడుగడుగునా నీరాజనాలు పలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ గంగిరెడ్డి, ఆరవేటి చంద్రారెడ్డి, కిషోర్‌రెడ్డి, చంద్ర ఓబుళరెడ్డి, రాజారెడ్డి, మైసూరారెడ్డి, నారాయణరెడ్డి, నరసింహారెడ్డి, కేపీ నరసింహారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, అన్నమయ్య, బాలచంద్రారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కారం కానప్పుడు సమావేశాలు ఎందుకు?



మాట్లాడుతున్న కౌన్సిలర్ బాబు

కమలాపురం రూరల్, ఫిబ్రవరి 15 : సమస్యలు పరిష్కారం కానప్పుడు సమావేశాలు ఎందుకని టీడీపీ కౌన్సిలర్లు బాబుల్ రిహానా, మాబుచాన్ ప్రశ్నించారు. గురు వారం నగర పంచాయతీ పరిధిలో ఎన్ని సమావేశాలు జరిగినా చెప్పిన సమస్యలు పరిష్కారం కానప్పుడు సమావేశాలు ఎందుకు జరపడం అన్నారు. గురువారం నగర పంచాయతీ కార్యాలయంలో నగర పంచాయతీ చైర్ పర్సన్ మార్పురి మేరి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. టీడీపీ కౌన్సిలర్లు మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా ప్రతి కౌన్సిల్ సమావేశంలో నగర పంచాయతీ పరిధిలోని సమస్యలు చెబుతున్నామని, ఇంత వరకు ఒక సమస్య కూడా పరిష్కారం కాలేదని 12వ వార్డు కౌన్సిలర్‌బాబు అన్నారు. నగర పంచాయతీ పరిధిలో ఎక్కడ చూసినా డ్రైనేజీ సమస్య అధికంగా ఉందని, ప్రజలు ఇబ్బందిపడుతున్నారన్నారు.

పులివెందులలో రూ.26.02 కోట్ల నిధులు దుర్వినియోగం

● కలెక్టర్‌కు తెలియజేసిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంగల



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వంగల శశిభూషణ్‌రెడ్డి

కడప (మారుతీనగర్), ఫిబ్రవరి 15: పులివెందులలో రూ.26.02 కోట్ల నిధులు దుర్వినియోగమయ్యాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు గురువారం ఆయన కలెక్టర్ విజయరామరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సొంత జిల్లా ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న పులివెందుల నియోజకవర్గంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్‌ఆర్ ఈజీఎస్) నిధులు 26.02 కోట్లు దుర్వినియోగమయ్యాయన్నారు. జిల్లాలో ఏ నియోజకవర్గానికీ మట్టి రోడ్ల నిర్మాణానికి కేంద్రం నిధులు మంజూరు చేయలేదన్నారు. కేవలం జగన్‌రెడ్డి సొంత నియోజకవర్గమైన పులివెందులకు రూ.26.02 కోట్లు మంజూరు చేశారన్నారు. ఆ నిధులతో 349 మట్టిరోడ్ల మరమ్మతు పనులను చేపట్టాల్సి ఉందని, రోడ్ల నిర్మాణంలో కూలీల కడుపు కొట్టి వారికి పనిలేకుండా చేసి కేవలం యంత్రాలతో నాసిరకంగా పనులు చేశారన్నారు. వైసీపీ కార్యకర్తల కోసమే ఆ పనులు చేపట్టం దారుణమన్నారు. సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ అధికారులు నిర్లక్ష్య ధోరణి వీడాలి



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్ఈ రమణ

సీకేదిన్నె, ఫిబ్రవరి 15: విద్యుత్ అధికారులు నిర్లక్ష్య ధోరణి వీడాలని జిల్లా విద్యుత్తు శాఖ అధికారి ఎస్ఈ ఎస్.రమణ తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలంలోని 33/ 11 సబ్‌స్టేషన్‌లో చింతకొమ్మదిన్నె తదితర ప్రాంతాల్లో లైన్లను, ట్రాన్స్‌ఫార్మర్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్తు సరఫరాలో అంతరాయాలు ఎక్కువగా ఉన్నాయని, సిబ్బంది విద్యుత్తు లైన్ల వెంబడి తిరిగి సమస్యలు గుర్తించి ఎప్పటికప్పుడు మరమ్మతులు చేపట్టాలన్నారు. లైన్లకు, ట్రాన్స్‌ఫార్మర్లకు అడ్డు వచ్చిన కొమ్మలను తొలగించి విద్యుత్తు ప్రమాదాలను నివారించాల న్నారు. వ్యవసాయ పొలాలకు అధిక ఓల్టేజీ విద్యుత్తు ద్వారా కంచె ఏర్పాటు చేయడం చట్టరీత్యా నేరమని, తద్వారా విద్యుత్తు సరఫరాలో అంతరాయాలు ఏర్పడడమే కాకుండా ప్రమాదాలు జరుగుతాయన్నారు. కావున కంచెలను నిర్మూలించాలన్నారు. వాలిన స్తంభాలను, లూజ్ లైన్లను ఎప్పటికప్పుడు సరిచేయాలన్నారు. పగిపూట వీధిలైట్లు వెలగకుండా చూడాలని, విద్యుత్తు వృథాకాకుండా తగు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. రానున్న రోజుల్లో పది, ఇంటర్ పరీక్షలను దృష్టిలో ఉంచుకుని పరీక్షా కేంద్రాల వద్ద ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్ల నిర్వహణ సక్రమంగా చేపట్టాలన్నారు. విద్యుత్తు ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించి విద్యుత్తు చౌర్యాన్ని అరికట్టాలన్నారు. సబ్‌డివిజన్ డీఈఈ కృష్ణదేవ, ఏఈలు రమణ, వేణుగోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌సీసీ కార్యక్రమంలో పాల్గొనడం అభినందనీయం

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 15 : విద్యార్థులు విద్యతో పాటు సేవా భావం కలిగిన ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ వంటి కార్యక్రమాల్లో పాల్గొనడం అభినందనీయమని ప్రిన్సిపల్ సలీంబాషా తెలిపారు. గురువారం కడప నగరం కోటిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సెకండ్ బీఏ చదువుతున్న ఎన్‌సీసీ విద్యార్థిని ఎస్.షబానా ఈ నెల 1 నుండి 12 వరకు అస్సాంలో జరిగిన స్పెషల్ నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంపులో పాల్గొని అధికారుల ప్రశంసలు అందుకుని దిగ్విజయంగా తిరిగి వచ్చినందుకు ఆమెను ప్రిన్సిపాల్ సత్కరించారు.

'గ్రూప్-2 పరీక్షను వాయిదా వేయండి'

కడప (సెవెన్‌రోడ్స్), ఫిబ్రవరి 15:గ్రూప్-2 పరీక్షను వాయిదా వేయాలని డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం చిన్ని, వీరనాల శివకుమార్ డిమాండ్ చేశారు. గురువారం కడప పాత బస్టాండు లోని జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత ఐదు సంవత్సరాల పోరాట ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం గత సంవత్సరం చివరిలో గ్రూప్-2 నోటిఫికేషన్ విడుదల చేసిందని, కానీ ప్రిపరేషన్‌కు సరైన సమయం లేకపోవడం, సిలబస్ మార్పు చేయడం వల్ల అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇదే విషయాన్ని ఏపీపీఎస్సీ అధికారులకు, ప్రభుత్వానికి విన్నవించినా ఫలితం లేదన్నారు. కావున నిరుద్యోగుల అభీష్టం మేరకు గ్రూప్-2 పరీక్షను వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. ఇష్టారాజ్యంగా నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు. వాయిదా వేయకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

పనులను వేగవంతం చేయాలి: కమిషనర్

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 15 : ఎస్‌టీపీ పనులను వేగవంతం చేయాలని కమిషనర్ ప్రవీణ్‌చంద్ కార్పొరేషన్ అధికారులకు ఆదేశించారు. లే అవుట్లలో యూజీడీ పనులకు ప్రణాళికలు సిద్ధం చేయాలని పబ్లిక్ అండ్ హెల్త్, ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. గురువారం కడప నగరంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఎస్టీపీ పనులను ఆయన పరిశీలించారు. మోటార్ల వివరాలను అధికారులకు అడిగి తెలుసుకున్నారు. 20 ఎంఎల్‌టీ నీటి ట్రీట్‌మెంటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని పబ్లిక్ అండ్ హెల్త్ విభాగాన్ని ఆదేశించారు. అలాగే నానాపల్లె, వైఎస్‌ఆర్ కాలనీతో పాటు మరి కొన్ని లేఅవుట్లలో యూజీడీ ఏర్పాటు చేసేందుకు తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు.

భూ ఆక్రమణకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

● ఆర్డీఓకు బహుజన సంక్షేమ సంఘం వినతి

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 15: దళితుల భూమిని అన్యాయంగా ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఏపీ బహుజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అందెల బాల ఓబయ్య డిమాండ్ చేశారు. గురువారం కడప ఆర్డీఓకు ఆయన వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ పెండ్లిమర్రి మండలం ఉలవలపల్లె గ్రామ నివాసి కొండూరు విమల అనుభవంలో ఉన్న భూమిని పెండ్లిమర్రి మండలం కొండూరు గ్రామ పొలం సర్వేనెం.814/1లో విస్తీర్ణం 1.50 ఎకరాలతో పాటు మరికొంత భూమిని పక్కనే ఉన్న భూమి యజమానులు ఆక్రమించుకున్నారన్నారు. కావున భూమి సమస్యను త్వరితగతిన పరిష్కరించి ఆక్రమణకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నేటి బంద్‌ను విజయవంతం చేయండి : సీపీఐ

కడప (సెవెన్ రోడ్స్), ఫిబ్రవరి 15: కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక చట్టాలను నిరసిస్తూ కిసాన్ మోర్చా నేతృత్వంలో తలపెట్టిన గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర కోరారు. గురువారం స్థానిక జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. రైతులు పంటల సాగుకు అవసరమైన విత్తనాలు ఎరువులు, పురుగు మందుల ధరలు, కూలీల ఖర్చు అమాంతం పెరిగిపోవడంతో పెట్టుబడి భారంగా మారిందన్నారు. పంటలు చేతికొచ్చే సమయానికి గిట్టుబాటు ధరలు ఉండక అతివృష్టి అనావృష్టి కారణంగా వరుస నష్టాలతో తల్లడిల్లుతున్న రైతులు చేసిన అప్పులు తీర్చలేక అవమానభారంతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. బంద్‌ను జయప్రదం చేయాలన్నారు.

భారత్, నేపాల్ విద్యాసమ్మిట్‌లో వీసీ

కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 15 : అంతర్జాతీయ స్థాయిలో విద్యాబోధన, పరిశోధనవిధానాలు దేశాల మధ్య పరస్పర సహకారం ప్రోత్సహించేలా నేపాల్ దేశంలో ఈ నెల 15 నుంచి 17 వరకు నిర్వహించే భారత విశ్వవిద్యాలయ సంఘం భారత్ , నేపాల్ విద్యా సమ్మిట్ 2024లో వైవీయు వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్ ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. ఈ సమ్మిట్‌ను నేపాల్ ప్రధాని ప్రారంభించారు. ఆసియా దేశాల్లో ఉన్నత విద్యలో అమలు చేస్తున్న తమ విధానాలు పరస్పర ఆలోచనలు పంచుకోనున్నారు. నేపాల్ ఆసియా దేశాల విద్యార్థులను ఆకర్షించడంలో సహాయపడడం కూడా సమ్మిట్ లక్ష్యం.

అనతికాలంలోనే మంచి ర్యాంకులు: ఆర్డీఓ, డీఎస్పీ



ర్యాలీలో బీరం జూనియర్ కళాశాల యాజమాన్యం, జిల్లా అధికారులు

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 15 :అనతికాలంలోనే మంచి ర్యాంకులు సాధించారని ఆర్డీఓ మధుసూదన్, డీఎస్పీ షరీఫ్, ఎంప్లాయిమెంటు అధికారి సురేష్ కుమార్, కుడా వీసీ ఓబులేసు నందన్ తెలిపారు. గురువారం కడప నగరంలో జేఈఈ మెయిన్స్ 2024 ఫలితాలకు సంబంధించి బీరం శ్రీధర్ రెడ్డి జూనియర్ కళాశాల యాజమాన్యం విజయయాత్రను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన వారు మాట్లాడుతూ మొదటి బ్యాచ్‌తోనే 20 మంది విద్యార్థులు ఐఐటీ, ఎన్ఐటీ సీట్లు సాధించడమే కాకుండా రెండో బ్యాచ్‌లో కూడా ఆ ర్యాంకులకు ధీటుగా 22 మందికి 90కి పైగా పర్సంటైల్ రావడం గర్వకారణమన్నారు. మన జిల్లా పేరును జాతీయ స్థాయిలో వినబడేలా చేసినందుకు గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో బీరం జూనియర్ కళాశాల కరస్పాండెంట్ సుబ్బారెడ్డి, చైర్ పర్సన్ సరస్వతమ్మ, డైరెక్టరు స్వాతి శ్రీకాంత్, ప్రిన్సిపాల్ శ్వేత, హేమచందర్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో దివ్యాంగులకు ఒరిగిందేమీ లేదు: వీహెచ్‌పీఎస్

కడప (మారుతీనగర్), ఫిబ్రవరి 15: వైసీపీ పాలనలో దివ్యాంగులకు ఒరిగిందేమీ లేదని వీహెచ్‌పీఎస్ దివ్యాంగ హక్కుల పోరాట సమితి రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు చిన్నసుబ్బయ్య, మాతయ్య ధ్వజమెత్తారు. గురువారం స్థానిక వీహెచ్‌పీఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. దివ్యాంగుల పెన్షన్‌ను తక్షణమే రూ.6వేలకు పెంచాలన్నారు.

బాబుతోనే 'భవిష్యత్తుకు గ్యారెంటీ'



జమ్మలమడుగు: భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భూపేశ్‌రెడ్డి తదితరులు



ప్రొద్దుటూరు: 11 వ వార్డులో ప్రచారంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి



ప్రొద్దుటూరు: బాలాజీ నగర్‌లో ప్రచారం చేస్తున్న ప్రవీణ్‌రెడ్డి సోదరి హరితా రెడ్డి



ముద్దనూరు: మినీ మేనిఫెస్టోను వివరిస్తున్న భూపేశ్‌రెడ్డి సతీమణి జ్యోతి

జమ్మలమడుగు, ఫిబ్రవరి 15: చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్ర భవిష్యత్తు బాగుపడుతుందని భూపేశ్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని 11, 12 వార్డుల్లో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. సూపర్-6 మినీ మేనిఫెస్టోను ప్రజలకు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ హయాంలో జమ్మలమడుగు నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి లేదని విమర్శించారు. కన్నెతీర్థం-సున్నపురాళ్లపల్లె గ్రామాల మధ్యలో స్టీల్‌ప్లాంట్ నిర్మాణానికి వేసిన శిలాఫలకాలు సమాధిరాళ్లగా మారాయన్నారు. ఈ సందర్భంగా క్యాంబెల్ వైద్యశాల సమీపంలో ప్రేమ్‌కుమార్, పుష్పరాజు, మాబు, మస్తాన్‌వలి, బాషా తదితరులు ఆయనను పూలమాలలో సత్కరించి, తాము టీడీపీలోకి చేరుతున్నట్లు తెలిపారు. వెంటనే భూపేశ్‌రెడ్డి వారికి కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. టీడీపీ నాయకులు సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, వాల్మీకి సేవా సంఘం అధ్యక్షుడు పెద్దకంబయ్య, కిరణ్‌రాయల్, అర్షద్, జనసేన నాయకులు నాగార్జున, జయచంద్ర, సంతోష్, మద్దిలేటి, వై.తులసిరెడ్డి, జి.కె.గైబు, మస్తాన్‌వలి, చిన్నయ్య, జింకల బాష, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

జే టాక్స్ రూపంలో జగన్ దోపిడీ: మాజీ ఎమ్మెల్యే వరద

ప్రొద్దుటూరు : రాష్ట్రంలో ప్రతి రంగంలో జే టాక్స్ పేరుతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వేల కోట్లు దోచుకుని రాష్ట్ర ప్రజలకు అభివృద్ధి లేకుండా చేశాడని మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ఆరోపిం చారు. గురువారం స్థానిక 11వ వార్డులోని సార్వకట్టవీధి, గిడ్డంగివీధి, మేదరవీధి, స్వయం సేవక్‌రోడ్డులో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ ముందస్తు మేనిఫెస్టోలో ప్రకటించిన హామీల కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, పట్టణ టీడీపీ మాజీ అధ్యక్షుడు ఘంటశాల వెంకటేశ్వర్లు, కడప పార్లమెంటు కార్యదర్శి నాగమునిరెడ్డి మాజీ కౌన్సిలర్లు ఘంటశాల సావిత్రమ్మ, నారాయణ, సత్యనారాయణ , జీసీ పుల్లయ్య, ఘంటశాల శ్రీనివాసులు, వెంకటస్వామి, ఉట్టి రమేష్ , అల్లంపుల్లయ్య, చంద్ర , వద్దిబాలుడు, తలారి పుల్లయ్య, టప్పా మహబూబ్‌బాషా, మాజీ సర్పంచ్‌లు అర్కటవేముల కృష్ణారెడ్డి , వెలవలి ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

టీడీపీతోనే సంక్షేమం

టీడీపీతోనే ప్రతి ఇంటికి సంక్షేమంతో పాటు అభివృద్ధి సాధ్యమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రవీణ్‌రెడ్డి సోదరి హరితా రెడ్డి తెలి పారు. గురువారం స్థానిక 15 వవార్డు లోని బాలాజీ నగర్‌లో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. మాజీ కౌన్సిలర్లు నల్లబల్ల భాగ్యమ్మ, సూర్యనారాయణరెడ్డి ,నూర్జహాన్, బీసీ సెల్ కార్యదర్శి తాటి శ్రీనువాసులు, ఆవుల దస్తగిరి, శూలం ప్రసాద్ పాల్గొన్నారు.

ముద్దనూరు: మహిళా సంక్షేమం కోసం చంద్రబాబునాయుడు ఎన్నో పథకాలు ప్రవేశపెడుతున్నారని జమ్మలమడుగు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి భూపేష్ రెడ్డి సతీమణి జ్యోతి తెలిపారు. మండల పరిధిలోని ఓబులాపురం గ్రామంలో గురువారం బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఓబులాపురం గ్రామ నాయకులు రామసుబ్బారెడ్డి, కృష్ణారెడ్డి, ప్రేమనాథ్‌రెడ్డి, రాజారెడ్డి, నరేంద్రనాథ్‌రెడ్డి, జయసింహారెడ్డి, విష్ణు, గడ్డం శంకర్, పవన్, గంగరాజు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీని గెలిపించండి

పోరుమామిళ్ల: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని బద్వేలు టీడీపీ ఇన్‌చార్జి బొజ్జ రోశన్న పిలుపునిచ్చారు. గురువారం రంగ సముద్రం పంచాయతీ పరిధిలో మహబూబ్‌నగర్ కాలనీలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఎంపీటీసీ కల్వకూరి రమణ, టీడీపీ నాయకులు సీతా వెంకటసుబ్బయ్య, సంచర్ల మాజీ సర్పంచ్ సోమిరెడ్డి, టీడీపీ జిల్లా కార్యదర్శి తిరుమలశెట్టి సుబ్బారావు, టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు బండి ఓబులేసు, డ్రైవరు ఎస్ఎంబాషా, చిన్నప్పతో పాటు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బద్వేలు రూరల్ :రాబోవు ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వచ్చి సీఎంగా చంద్రబాబు అధికారం చేపడితేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని బొజ్జ అరుణ, నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు మాచుపల్లె లక్ష్మి దేవి అన్నారు. గురువారం మున్సిపల్ పరిధిలోని 30వ వార్డు చింతపుత్తాయపల్లెలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ నిర్వహించారు. కేవీ సుబ్బారెడ్డి , పోరమామిళ్ల మాజీ సర్పంచ్ హబీబున్నీసా, ఆదిలక్షుమ్మ, సుబ్బారెడ్డి, చెన్నారెడ్డి, నారాయణ రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, చెన్నయ్య, నరసింహ నాయుడు, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.



పోరుమామిళ్ల: కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ ఇన్‌చార్జి రోశన్న



చింతపుత్తాయపల్లెలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న బొజ్జ అరుణ, మాచుపల్లె లక్ష్మిదేవి

స్కూటీపైనుంచి పడి కోడూరు మాజీ సర్పంచి మృతి



సునంద

ఎర్రగుంట్ల, ఫిబ్రవరి 15: ఎర్రగుంట్ల మండలంలోని వై.కోడూరు గ్రామ మాజీ సర్పంచి శిరిగిరెడ్డి సునంద(48) గురువారం రాత్రి మృతిచెందారు. కమలాపురం మండలంలోని బయనపల్లె-చెప్పలి మార్గంలో స్కూటీపై వెనుక కూర్చుని వెళుతుండగా కిందపడి తీవ్రంగా గాయపడింది. కడపలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఆమె భర్త శిరిగిరెడ్డి శివారెడ్డి తెలిపారు. సునంద 2013 నుంచి 2018 వరకు కోడూరు సర్పంచిగా పనిచేశారు. వారికి ఇద్దరు సంతానం. సునంద మృతిపట్ల పలువురు రాయకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. పలువురు సంతాపం తెలియజేశారు.

టీడీపీలోకి భారీగా చేరికలు

కలసపాడు, ఫిబ్రవరి 15 : మండలంలోని మామిళ్లపల్లెలో మాజీ ఎమ్మెల్యే విజయమ్మ ఆధ్వర్యంలో 200 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. జడ్పీటీసీ మాజీ సభ్యుడు దాదన భూపాల్‌రెడ్డి, లింగారెడ్డిపల్లె మాజీ సర్పంచ్ బాలవెంకటరెడ్డి ఆధ్వర్యంలో వారు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే విజయమ్మ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంపై ప్రజలు విసిగి వే సారన్నారు. అర్థం లేని ప నులు, అభివృద్ధి లేని రాష్ట్రం అయిందన్నారు. ఇష్టా రాజ్యంగా ప్రజలపై అనేక పన్నులు రుద్దడంతో పాటు. నవరత్నాల పేరుతో భజన చేస్తున్నారని విమర్శించారు. నకిలీ మద్యంతో కూలీనాలి చేసుకునే ప్రజల ఆరోగ్యంతో చెలగాటవాడుతున్నారన్నారు. కార్యక్రమంలో యువ నాయకుడు రితీష్‌రెడ్డి, బద్వేలు టీడీపీ ఇన్‌చార్జి రోశన్న,మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ రంతు, మండల పార్టీ అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, నాయకులు భద్రయ్య, పట్టాభిరెడ్డి రవీంద్రరెడ్డి , మల్లికార్జున రెడ్డి, శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కలసపాడులో టీడీపీలో చేరిన నేతలు



మైదుకూరు:టీడీపీ చేరిన వైసీపీ నేతలు

పోరుమామిళ్ల : మండలంలోని రంగసముద్రం పంచాయతీ మహబూబ్‌నగర్ కాలనీ కి చెందిన 14వ వార్డు మెంబరు షేక్ హుసేనీతో సహా 35 కుటుంబాల వారు టీడీపీలో చేరారు. మండల టీడీపీ అధ్యక్షుడు నగిరి భైరవ ప్రసాద్, సర్పంచ్ యనమల సుధాకర్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ చెరుకూరి చెన్నరాయుడు, ఎంపీటీసీ కల్వకూరి రమణ, మల్లికార్జునరెడ్డి , కల్వకూరి చిన్న వెంకటసుబ్బయ్య, బండి ఓబులేసు, రామసుబ్బారావు పాల్గొన్నారు.

మైదుకూరు రూరల్: అక్రమ మైనింగ్, ఇసుక మాఫియా, భూ ఆక్రమణలతో వైసీపీ నేతలు రాష్ట్రాన్ని అడ్డగోలుగా దోచుకున్నారని మైదుకూరు టీడీపీ ఇన్‌చార్జ్ పుట్టా సుధాకర్ యాదవ్ మండిపడ్డారు. వైసీపీ నిరంకుశ పాలనకు విసుగుచెంది మున్సిపాలిటీ పరిధిలోని వీణా విజయ నగర్ కాలనీకి చెందిన 50 కుటుంబాలు గురువారం పుట్టా సమక్షంలో టీడీపీ కండువాలను కప్పుకొని పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో బీవి రమణ, రాజేష్, పాలకొండయ్య, శివ, నవీన్, సుబ్బరాయుడు, సాలమ్మ, సుబ్బమ్మ, కిషోర్ మహేష్, గని తదితరులు ఉన్నారు. ఆకుల కృష్ణయ్య, కటారు కృష్ణ, రమణ, బండిఅమర్‌నాధ్, కొండపల్లి ఉమాకాంత్, మాదం రమణ తదితరులు పాల్గొన్నారు.

రాచమల్లు ఓటమి ఎప్పుడో ఖరారైంది

● సీఎం సురేష్ నాయుడు

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 15 : ప్రొద్దుటూరులో రాచమల్లు ఓటమి ఎప్పు డో ప్రజలు ఖరారు చేశారని టీడీపీ రాష్ట్ర నాయకుడు సీఎం సురేష్ నాయుడు తెలిపారు. గురువారం స్థానిక పాత బస్టాండ్‌లోని అన్నా క్యాంటీన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాచమల్లు ప్రొద్దుటూ రు ప్రజలకు ఇచ్చిన హామీలను వాగ్దానాలను ఎట్లా తుంగలో తొక్కాడో ప్రజల్లో ఎండగడతామన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ముఖ్య మంత్రి జగన్, మంత్రులు ఎమ్మెల్యేలు అందరూ అవినీతి పరులేనన్నారు. జగనన్న కాలనీల పేరుతో కోట్ల రూపాయల కుంభకోణానికి తెరలేపారన్నారు. వైసీపీ అసమ్మతి నేతలు ఆయనకు వ్యతిరేకంగా ఏకంగా ప్రచారం చేస్తున్నారన్నారు. వైసీపీ టిక్కెట్టు రాచమల్లుకు కాకుండా ఇతరులకు ఎవరికి ఇచ్చినా భారీ మెజారితో గెలిపిస్తామని ప్రకటిస్తున్నారన్నారు. ముందు నీ పార్టీలో అసమ్మతిని గురించి ఆలోచించుకోమన్నారు. రానున్న రోజుల్లో వైసీపీలోని మహా మహులు టీడీపీలో చేరతారన్నారు. రేపటినుంచి రామేశ్వరంలోని మునిస్వామి ఆలయం నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తామన్నారు. టీడీపీ నేతలు ముక్తియార్ ప్రభాకర్‌రెడ్డి , ఈవి సుధాకర్‌రెడ్డి , నల్లబోతుల నాగరాజు ,డాక్టర్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఎం సురేష్ నాయుడు, ముక్తియార్, ప్రభాకర్‌రెడ్డి

రాచమల్లూ.. వాగ్దానాలు మరిచావా?

ప్రొద్దుటూరు , ఫిబ్రవరి 15 : ఇల్లు లేని ప్రతి పేదవాడికి పైసా ఖర్చులేకుండా రెండు సెంట్ల స్థలంలో ఇళ్ళు నిర్మించి ఒకచేత్తో పట్టా మరోచేత్తో ఇంటి తాళం అందించకపోతే... అని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడి 2019 ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానం నెరవేరిందా అని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రవీణ్‌రెడ్డి ప్రశ్నించారు. గురువారం బొల్లవరం జగనన్న కాలనీల్లో ఇళ్ళ నిర్మాణాలను లబ్దిదారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో ఇళ్లు తంతే కూలిపోయే రకంగా నిర్మిస్తున్నారన్నారు. ఈ కాలనీల్లో ఇప్పటికీ రోడ్లు లేవన్నారు. ఇలాంటి ఇళ్లల్లో పేదలను ఉండమని రాచమల్లు చెప్పడం పేదలను అవమానించడమేనన్నారు. ప్రొద్దుటూరు పట్టణం నుంచి రాజుపాళెం మండలం చిన్న శెట్టిపల్లె వద్ద జగనన్న కాలనీలు ఏర్పాటు చేయడమంటే పట్టణాల నుండి ఇళ్ళులేని నిరుపేదలను పల్లెలకు తరమడమేనన్నారు. టీడీపీ ప్రభుత్వం వస్తే ఈ కుంభకోణంలో ఎన్ని కోట్లు రాచమల్లు బృందం మింగింది బయట పెడతామన్నారు. వారిని జైలుకు పంపుతామన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు జబీవుల్లా ,మండల కన్వీనర్ బాబుల్‌రెడ్డి రాజుపాళెం మండల కన్వీనర్ విశ్వనాధరెడ్డి ,మాజీ కౌన్సిలర్లు తాటి శ్రీనివాసులుయాదవ్ ,నల్లబల్ల భాగ్యమ్మ టీడీపీ మహిళా కార్యదర్శి శ్రీదేవి ,పొట్టిపాటి గంగాధర్ శూలం ప్రసాద్, మేరువ మూర్తి ,సుబ్బు తదితరులు పాల్గొన్నారు.



బొల్లవరం జగనన్న కాలనీలో మాట్లాడుతున్న ప్రవీణ్‌రెడ్డి

స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఏర్పాటు చేయాలి

ప్రొద్దుటూరు , ఫిబ్రవరి 15 : విశ్వకర్మ యోజన అమలులో భాగంగా జిల్లాలో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి ప్రొద్దుటూరు నియోజకవర్గ కన్వీనర్ గొర్రె శ్రీనివాసులు కలెక్టర్ విజయరామరాజును కోరారు. ఈ మేరకు గురువారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. విశ్వకర్మ యోజన అమలులో జాప్యాన్ని నివారించాలని కోరారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్రమణ్యం, జిల్లా కార్యదర్శి లక్ష్మణరావు, కన్వీనర్ మాచనూరు సుబ్బరాయుడు పాల్గొన్నారు.

'నకిలీ పట్టాలతో ప్రభుత్వ స్థలాల విక్రయం'

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 15: అమృత నగర్‌లో పేదలకు ఇచ్చిన ప్రభుత్వ స్థలాలకు నకిలీ పట్టాలు సృష్టించి విక్రయిస్తున్నారని సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ ఆరోపించారు. గురువారం స్థానిక తహసీల్దారు కార్యాయలం వద్ద అమృతనగర్‌లో పేదల స్థలాల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని, రోడ్లు, విద్యుత్, తాగునీటి వసతి కల్పించి పేదల ఇంటి నిర్మాణాలకు రుణ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. 2008, 2012 లో పేదలకు ఇచ్చిన స్థలాలను తప్పుడు పత్రాలు సృష్టించి కొందరు కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. రెవెన్యూ అధికారులు విచారించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రమీజా హరి నరసింహం మధు , హుస్సేన్ బాషా సరస్వతి పాల్గొన్నారు.

శిలువ వద్ద ప్రత్యేక ప్రార్థనలు

ముద్దనూరు ఫిబ్రవరి 15: జమ్మలమడుగు రోడ్డులోని పులికోన ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన శిలువ వద్ద గురువారం ఎల్ఎమ్ కాంపౌండ్ సీఎస్ఐ చర్చి పాస్టర్ రెవరెండ్ దేవసహాయం ఆధ్వర్యంలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దువ్వూరు పాస్టర్ రెవరెండ్ దానియేలు శిలువ ప్రాముఖ్యతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ రెవరెండ్ బి.ప్రభాకర్, ఎన్.ప్రభాకర్, జాకబ్‌ఫ్రాంక్, మోహన్, జమ్మలమడుగు సీఎస్ఐ క్యాంప్‌బెల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ అగస్టీన్‌రాజు, సర్పంచ్ సరళ పాల్గొన్నారు.

30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలి



నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 15 : ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని ఏపీ జేఏసీ ప్రొద్దుటూరు తాలూకా చైర్మన్ కేజే రఘురామిరెడ్డి డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించాలని గురువారం నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023లో బకాయి ఉన్న రెండు డీఏలతోపాటు, సీపీఎస్ వారికి డీఏ, అరియర్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. సరెండర్ లీవ్ బకాయిలు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు మంజూరు చేయాలని, సీపీఎస్, జీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ రామసుబ్బయ్య, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు లక్షమయ్య, రెడ్డన్న, దస్తగిరి రెడ్డి, లక్ష్మిరెడ్డి, ఎన్జీఓ అసోసియేషన్ సభ్యులు సుజాత, ప్రమీల, జయంతి కుమారి, సుబ్బారెడ్డి, శివరామానుజం తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

జమ్మలమడుగు, ఫిబ్రవరి 15: మున్సిపాలిటీ పరిధిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సీపీఎం నాయకులు యేసుదాసు, దాసరి విజయ్ తదితరులు డీఎస్పీ యశ్వంత్‌కు గు రువారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ, సీపీఎం నాయకులు వినయ్‌కుమార్, మన్సూర్, అబ్రహం, కమాల్, కృష్ణారెడ్డి, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

చేనేతలకు షరతులు లేకుండా పెన్షన్ ఇవ్వాలి

జమ్మలమడుగు, ఫిబ్రవరి 15: షరతులు లేకుండా చేనేత కార్మికులకు వృద్ధాప్య పెన్షన్లు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శివనారాయణ డిమాండ్ చేశారు. గురువారం జమ్మలమడుగులోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో నేత కార్మికుల సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మికులు లక్ష్మినారాయణ, కొండయ్య, సంజీవరాయుడు, శేషయ్య, దాసు పాల్గొన్నారు.

నిరంకుశ పాలనకు చరమగీతం.. ప్రజల నిర్ణయం

మైదుకూరు రూరల్, ఫిబ్రవరి 15 : రాష్ట్రంలో నిరంకుశ, దుర్మార్గమైన పాల నకు చరమగీతం పాడాలని ప్రజలు నిర్ణయించు కొన్నారని ఏపీ వారియర్ నియోజకవర్గ టీం లీడర్ నేట్లపల్లి శివ రాం అన్నారు. స్థానిక పార్టీ కార్యాల యంలో గురువారం తొలిసారి ఓటు హక్కును వినియోగిచుకుంటున్న ప్రతి ఒక్కరిని కలిసేందుకు మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శివరాం మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వా రా కొత్తగా ఓటు హక్కు వినియోగించుకోనున్న ప్రతి ఒక్కరిని కలుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మేకల చిన్న, అవిష, వి.విజయలక్ష్మి, భారతి, పాశం సుధాకర్, సతీష్, అల్తాఫ్, భరత్, శ్రీధర్, నరసింహ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

చాపాడు, ఫిబ్రవరి 15: చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని మైదుకూరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఖాజామైనుద్దీన్ అన్నారు. విజయనగరం గ్రామంలో గురువారం సాయంత్రం నిర్వహిం చిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయనమాట్లాడుతూ సివిల్, క్రిమినల్ కేసులకు సంబంధించిన చట్టాలపై అవగాహన కలిగించారు. గ్రామాల్లో ప్రజలు ఐకమత్యంతో ప్రశాంతంగా జీవించాలన్నారు. చిన్న గురువలూరు గ్రామంలోని బీసీ హాస్టల్‌ను ఆయన పరిశీలించారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దారు యామిని, ఎస్ఐ కొండారెడ్డి, బార్ ప్రెసిడెంట్ నారాయణరెడ్డి, ఆర్ఐ ప్రమీల, న్యాయమూర్తులు శివరామకృష్ణ, శ్రీనివాసులు, కరిముల్లా, జేకేచారి పాల్గొన్నారు.

ఫలించిన ఎంపీ రాయబారం

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 15: వైసీపీలో కొనసాగేలా విశ్వనాథరెడ్డికి నచ్చచెప్పడంలో ఎంపీ అవినాష్‌రెడ్డి , వైసీపీ జిల్లా అధ్యక్షుడు సురేష్‌బాబు సఫలీకృతులయ్యారు. ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి వైఖరితో విసిగి పోయిన కాశినాయన మండల వైసీపీ కన్వీనరు నల్లేరు విశ్వనాథరెడ్డి మైదుకూరు నియోజకవర్గ టికెట్టును డా. సుధాకు ఇవ్వరాదంటూ అసమ్మతి నేతలతో రెండుసార్లు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ విషయం అధిష్టానం దృష్టికి వెళ్లడంతో గురువారం ఎంపీ అవినాష్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు సురేష్‌బాబు ఆయనను కలిసి అదనపు సమన్వయకర్తగా బాధ్యతలు నిర్వహించేలా అంగీకరింపజేసినట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి లేకపోవడం విశేషం.

వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడాలి

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 15: వేసవిలో పోరుమామిళ్ల మండలంలో నీటి ఎద్దడి లేకుండా చూడాలని జడ్పీటీసీ సభ్యుడు ముత్యాల ప్రసాద్ సూచించారు. గురువారం పోరుమామిళ్లలోని స్త్రీశక్తి భవనంలో మండల సర్వసభ్యసమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు సీఎంబాషా, చెన్ను రాజశేఖర్, స్పెషల్ ఆఫీసరు చంద్రశేఖర్, ఎంపీడీవో వర ప్రసాదరావు, రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవిప్రకాశ్‌రెడ్డి, సహకార సంఘం చైర్మన్ వెంగల్‌రెడ్డి, ఎంపీటీసీ కల్వకూరి రమణ తదితరులు పాల్గొన్నారు.

అనతికాలంలోనే మంచి ర్యాంకులు

● నగరంలో ర్యాలీ ● పాల్గొన్న ఆర్డీఓ, డీఎస్పీ



ర్యాలీలో బీరం జూనియర్ కళాశాల యాజమాన్యం, జిల్లా అధికారులు

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 15: అనతికాలంలోనే మంచి ర్యాంకులు సాధించారని ఆర్డీఓ మధుసూదన్, డీఎస్పీ షరీఫ్, ఎంప్లాయిమెంటు అధికారి సురేష్ కుమార్, కుడా వీసీ ఓబులేసు నందన్ తెలిపారు. గురువారం కడప నగరంలో జేఈఈ మెయిన్స్ 2024 ఫలితాలకు సంబంధించి బీరం శ్రీధర్‌రెడ్డి జూనియర్ కళాశాల యాజమాన్యం విజయయాత్రను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన వారు మాట్లాడుతూ మొదటి బ్యాచ్‌తోనే 20 మంది విద్యార్థులు ఐఐటీ, ఎన్ఐటీ సీట్లు సాధించడమే కాకుండా రెండో బ్యాచ్‌లో కూడా ఆ ర్యాంకులకు దీటుగా 22 మందికి 90కి పైగా పర్సంటైల్ రావడం గర్వకారణమన్నారు. మనజిల్లా పేరును జాతీయ స్థాయిలో వినబడేలా చేసినందుకు గర్వంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో బీరం జూనియర్ కళాశాల కరస్పాండెంట్ సుబ్బారెడ్డి, చైర్ పర్సన్ సరస్వతమ్మ, డైరెక్టరు స్వాతి శ్రీకాంత్, ప్రిన్సిపల్ శ్వేత, హేమచందర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

విద్యార్థులు సేవా కార్యక్రమాల్లో ముందుండాలి

జమ్మలమడుగు, ఫిబ్రవరి 15: విద్యార్థులు సేవా కార్యక్రమాలకు ముందు వరుసలో ఉండాలని మోరగుడి గ్రామ సర్పంచ్ చౌడం జొల్లుకొండయ్య, ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ సూచించారు. గురువారం మోరగుడి గ్రామంలో ఎన్ఎస్ఎస్ శిబిరం ముగింపు సమావేశంలో వారు మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ సంజీవరెడ్డి, అధ్యాపకులు షఫి, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సైన్స్ జాతాను విజయవంతం చేయండి

బద్వేలు, ఫిబ్రవరి 15: పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉదయం 9.30 గంటలకు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సైన్స్ కళాజాతాను విజయవంతం చేయాలని ప్రధానోపాధ్యాయుడు సుబ్బారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం జనవిజ్ఞాన వేదిక కడప జిల్లా గౌరవాధ్యక్షుడు చింతంరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ఈ సైన్స్ కళాజాతా 2024 ఫిబ్రవరి 5 నుంచి 18 వ తేదీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రదర్శనను జయప్రదం చేయాలని కోరారు.

గంగమ్మ ఆలయానికి భూమిపూజ

బ్రహ్మంగారిమఠం, ఫిబ్రవరి 15: మండలంలోని రేకులకుంట్లలో గురువారం రాణిబావి గంగమ్మ ఆలయ నిర్మాణానికి కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మైదుకూరు నియోజకవర్గ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్, కడప మేయరు సురేష్‌బాబు భూమి పూజ చేశారు. బి.మఠం మండల ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు ముత్యాల రామగోవిందురెడ్డి, మైదుకూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి శెట్టిపల్లె నాగిరెడ్డి, మండల ఉపాధ్యక్షురాలు సుభాషిణి, సచివాలయ కన్వీనరు రాజానాయుడు, ఎంపీటీసీలు, సర్పంచ్ జ్యోత్స్న, తదితరులు పాల్గొన్నారు.

నేడు నర్సాపురంలో రథసప్తమి వేడుకలు

కాశినాయన ఫిబ్రవరి15: నర్సాపురంలోని లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయంలో శుక్రవారం రథసప్తమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా సూర్యప్రభ, శేష, గరుడ, హనుమంత, గజ, కల్పవృక్ష, చంద్రప్రభ వాహనాల్లో గ్రామోత్సవం ఉంటుందన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశామన్నారు.

వైద్యసేవలు సద్వినియోగం చేసుకోండి

ఖాజీపేట, ఫిబ్రవరి 15: గ్రామాల్లో వైద్యులు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని అడిషనల్ డీఎం అండ్ హెచ్‌వో ఎస్.రవిబాబు కోరారు. గురువారం ఖాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అంగవైకల్యం నివారణ, వైద్య పునరావాస శిబిరం నిర్వహించారు. డాక్టర్ అయేషాసుల్తానా, ఎంపీహెచ్ఈవో నాగభూషణం, స్టాఫ్ నర్సు లావణ్యలక్ష్మి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.